ప్రజాశక్తి
సోమవారం 5 డిసెంబర్ 2022
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా

ఆటంకాలను అధిగమించి విజయం సాధించారు

సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, నగర గౌరవాధ్యక్షురాలు దోనేపూడి కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ (సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్‌టియు బలపరిచిన) విజయ దుంధుబి మోగించింది. మొత్తం 11 డైరెక్టర్ పదవులకు విజయవాడ హనుమాన్‌పేటలోని జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం సొసైటీ ఎన్నికలు జరిగాయి. 11 డైరెక్టర్లకు గాను 10 స్థానాలను ప్రోగ్రెసివ్ ప్యానల్‌ను దక్కించుకుంది. ఈశ్వర్ ప్యానల్ తరపున పోటీచేసిన ఈశ్వరరావు డైరెక్టర్‌గా గెలుపొందారు. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరపున గుంజా అజయ్‌కుమార్ (686), గుర్రం ఆంజనేయులు (567), భూపతి గోవిందరావు (550), తాడిశెట్టి నాగరాజు (495), తిరుమారెడ్డి బ్రహ్మారెడ్డి (502), తోపుల శివశంకర్ (489), వేజెండ్ల ప్రభావతి (570), బచ్చు రాజేష్ (487), సింహాద్రి మస్తాన్‌రావు (485), గుంటక ప్రభాకరరెడ్డి (4712) గెలుపొందారు. ఈశ్వర్ ప్యానల్ తరపున డి.ఈశ్వరరావు (587) గెలుపొందారు.

నగరపాలక సంస్థలోని ఉద్యోగ, కార్మికులు సొసైటీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌ను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించారంటే వారిపై ఉన్న నమ్మకం, అభిమానమే నిదర్శనమని సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరుపున గెలుపొందిన విజేతలను నేతలు అభినందించారు.

ఈసందర్భంగా బాబూరావు, కాశీనాథ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పలు ఆటంకాలు సృష్టించినా ప్రొగ్రెసివ్ ఫ్రంట్ విజయం సాధించిందన్నారు. గతంలో వచ్చిన ఫలితాల కంటే ప్రస్తుతం వచ్చిన ఫలితాలను బట్టి పరిశీలిస్తే సొసైటీ అభివృద్ధికి సిట్టింగ్ ప్యానల్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ కృషి ఎంతో దాగుందన్నారు. ఉద్యోగ, కార్మికులు ఫ్రంట్ సభ్యులను ఆదరించారన్నారు. సొసైటీ బ్యాంక్ అభివృద్ధికి, ఉద్యోగ, కార్మికులకు మరిన్ని సేవలు అందించడానికి మరొక అవకాశం కల్పించారన్నారు. మిగిలిన ప్యానల్స్ డబ్బు, మద్యం, ఇతర పలు రూపాల్లో ఉద్యోగ, కార్మికులను అనేక ప్రలోభాలకు గురి చేసినా వాటికి లొంగకుండా ఓటర్లు మంచి తీర్పు నివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జ్యోతిబాస్, ఎం.డేవిడ్, సిఐటియు నాయకులు టి.ప్రవీణ్, యుటిఎఫ్ నాయకులు మల్లికార్జునరెడ్డి, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, అనంత్, విజయలక్ష్మి, ఎఐటియుసి నాయకులు ఎ.రంగనాయకులు, జెట్టి జేమ్స్, సిపిఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్ హరిచందన్, సిఎం జగన్ తదితరులు

రాష్ట్రపతికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఇతర ప్రముఖులు స్వాగతం పలికారు. అధికారిక పర్యటనలో భాగంగా తాడిగడప పురపాలక సంఘం పరిధిలోని పోరంకి మురళీ రిసార్ట్స్ లో రాష్ట్రప్రభుత్వం ద్వారా చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహార్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ పి.జాషువా, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బందరు, గుడివాడ ఆర్డీవోలు ఐ.కిషోర్, పి.పద్మావతి, ఇతర అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ప్రత్యేక పోలీస్ భద్రతా విభాగం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రపతి రాక సందర్భంగా విమానాశ్రయం నుంచి విజయవాడ వరకు దారిలో ఉన్న హోటళ్లను మూంచి వేశారు. అయితే కేసరపల్లి ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న క్రాస్ రోడ్స్ హోటల్‌ని మూయించకుండా వదిలివేయడం గమనార్హం. విమానాశ్రయం నుంచి వాహనాల్లో బయలుదేరిన రాష్ట్రపతి నేరుగా విజయవాడకు వెళ్లారు. దారి పొడవునా పోలీసులు బందోబస్తు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గన్నవరం విమానాశ్రయానికి వచ్చి ఇక్కడ నుండి విమానంలో వైజాగ్ వెళ్లారు.

కళా మండపం నమూనా చూపుతున్న హైకోర్టు న్యాయూర్తి దుర్గాప్రసాద్

ఘనంగా ఘంటసాల శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-మోపిదేవి

అమర గాయకులు, గాన గంధర్వ, పద్మశ్రీ బిరుదులు పొందిన ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ఘంటసాల స్వగ్రామమైన మోపిదేవి మండలంలోని టేకుపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా జరిగాయి. టేకుపల్లి శ్రీ బాలా పార్వతి సమేత రామేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఈ సమావేశం మాజీ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. తెలుగు సినీ పరిశ్రమ రంగంలో 2400 పాటలకు పైగా పాటలు పాడిన ఘంటసాల వెంకటేశ్వరరావు బాల్య జీవిత విశేషాలను మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఆకాశవాణి, దూరదర్శన్ వ్యాఖ్యాత ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ గంటసాల వెంకటేశ్వరరావుకు సినీ సాహిత్యం పట్ల ఉన్న మక్కువను తెలియజేస్తూ నిరంతర శ్రమజీవిగా తాను సినీ రంగ పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు. హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు తనకు జీవితకాల ఆరాధ్యులని, ఆయన పాడిన పుష్పవిలాపం, కుంతీ కుమారి వంటి గేయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. అనంతరం టేకుపల్లిలో శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నిర్మించనున్న ఘంటసాల వారి సంగీత సాహిత్య, నత్య కళా మండప నమూనాను సభలో ఆవిష్కరించారు. కిన్నెర ఆట థియేటర్స్ కార్యదర్శి శ్రీ మద్దాల రఘురాం ఘంటసాల జయంతి, వర్ధంతిలను వాటి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రముఖ గాయకులు ధూళిపాల ఆంజనేయ మిత్ర ఘంటసాల వెంకటేశ్వరరావు పాడారు. శ్రీ బాలాజీ సింగ్ ఘంటసాల (మిగతా 6లో)

రబీలో 3.25 లక్షల ఎకరాల్లో మినుము సాగు

- విత్తనశుద్ధి, సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు
- ఇంటర్వ్యూలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి మనోహరరావు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రబీలో పంటలు సాగుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు తెలిపారు. వరి మాగాణుల్లో రెండో పంటగా అత్యధిక విస్తీర్ణంలో రైతులు అపరాలు వెదజల్లుతున్నారని చెప్పారు. మేలైన విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడలు సాధించవచ్చన్నారు. రబీ సాగు, అపరాల సాగులో తీసుకోవాల్సిన మెళకువులను ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

ప్రశ్న: జిల్లాలో రబీలో ఏఏ పంటలు సాగవుతున్నాయి?

జవాబు: రబీలో అత్యధికంగా వరి మాగాణుల్లో రైతులు అపరాలు(మినుము, పెసర) సాగు చేస్తున్నారు. మొత్తం 4 లక్షల 04 వేల 176 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. అత్యధికంగా 3.25 లక్షల ఎకరాల్లో మినుము, 10,250 ఎకరాల్లో పెసర, 11,250 ఎకరాల్లో మొక్కజొన్న, 1,250 ఎకరాల్లో జొన్న, 7,500 ఎకరాల్లో వరి, 2,500 ఎకరాల్లో వేరుశనగ, 875 ఎకరాల్లో ఉలవలు, 150 ఎకరాల్లో మిర్చి, 175 ఎకరాల్లో మిర్చి సాగవుతుంది.

ప్ర: క్షారభూముల్లో రబీలో వరికి ప్రత్యామ్నాయంగా ఏ పంటలు సాగు చేయాలి?

జ: కాల్వల మరమ్మత్తులు చేయాల్సి ఉన్నందున ఈ ఏడాది రబీలో దాళ్వావరి సాగు నీరు ఇవ్వడం లేదు. క్షార భూములు అపరాల సాగుకు అనుకూలం కాదు. ప్రత్యామ్నాయంగా ఉలవ, ఆవాలు, లేకుంటే పశుపోషణకు అవసరమైన జనము తదితర పంటలు ఈ భూముల్లో సాగు చేసుకోవాలి.

ప్ర: మేలైన మినుము రకాలను సాగుకు సిఫార్సు చేస్తున్నారా?

జ: వరి మాగాణుల్లో అపరాల వెదజల్లుతున్నారు. చీడపీడలు తట్టకునే మేలైన విత్తనాలను విత్తుకోవాలి. పల్లాకు తెగులు తట్టుకునే ఎబిజి 752, 787, జిబిజి 1, టిబిజి 104, టిబిబి 128, ఎల్‌బిజి 904, ఎల్‌బిజి 932, తూడు, బుట్ట రకాల మినుములను సాగుకు సిఫార్సు చేస్తున్నాం. ఎకరానికి 16 కిలోలు విత్తనాలు వెదజల్లుకోవాలి.

ప్ర: అధిక దిగుబడులకు ఎటువంటి యాజమాన్య పద్దతులు అనుసరించాలి?

జ: మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడంతోపాటుగా శిలీంద్రాలు ఆశించకుండా మ్యాంకోజెబ్ కిలో విత్తనాలకు ఐదు గ్రామలు, రసం పీల్చే పురుగులు నియంత్రణకు ఇమిడా క్లోఫిడ్ 600 ఎఫ్ఎస్, లేకుంటే థైమిధాక్సన్ మందులను కిలో విత్తనానికి ఐదు మిల్లీ గ్రాములను విత్తనాలు వెదజల్లే 24 గంటల ముందు కలుపుకోవాలి. శిలీంధ్రనాశినిలు, రసం పీల్చే మందులను విత్తనాలకు పట్టించేందుకు రెండు గంటల వ్యవధి ఇవ్వాలి. విత్తనాలు జల్లుకునే రెండు గంటల ముందు కాండం గజ్జి, ఎండుతెగులు నియంత్రణకు జీవశిలీంద్రనాశిని ట్రైకోడెర్మా విరిడితో శుద్ది చేయాలి. ఈ విధంగా విత్తన శుద్ధి చేస్తే 15 నుంచి 20 రోజుల వరకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. 30 రోజులులోపు, 55 రోజుల్లో రెండు సార్లు తేలికపాటి తడులు ఇవ్వాలి. (మిగతా 6లో)

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి-వీరులపాడు

వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలసి ఆదివారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులన అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 3100 నగదు స్వాధీనం చేసుకున్నా మన్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వత్సవాయి మండలంలో 9 మంది అరెస్టు

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని భీమవరం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచార రావడంతో దాడులు నిర్వహించగా 9 మందిని అరెస్టు చేసి లక్షా 12, 132 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అభిమన్య తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఆరు పాడి గేదెలు మృతి

ప్రజాశక్తి కంచికచర్ల : లారీ ఢీ కొని ఆరు పాడి గేదెలు మతి చెందగా, మరో రెండు గేదెల తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని పరిటాలలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పరిటాల కు చెందిన బడుగు రాధాకష్ణ మూర్తికు చెందిన పాడి గేదెలను పొలం నుండి ఇంటికి తోలుకు వస్తుండగా విజయవాడ వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల గేదెల గుంపును వేగంగా ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో ఆరు పాడి గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. చనిపోయిన గేదెల విలువ సుమారు 5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పివియస్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

జనసేన పార్టీ దిమ్మె ఆవిష్కరణ

ప్రజాశక్తి - గంపలగూడెం : రాష్ట్రంలో జనసేన పార్టీతోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని కష్ణా ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకష్ణ తెలిపారు. ఆదివారం నాడు గంపలగూడెం మండలం వినగడప చెరువు కట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన ఆ పార్టీ జెండా దిమ్మను బండ్రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కో- ఆర్డినేటర్ రావి సౌజన్య, ఉపాధ్యక్షుడు బి శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షులు చింతలపాటి వెంకటకష్ణ, వివిధ గ్రామాల జనసేన సైన్యం పాల్గొంది.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నందిగామ : పట్టణం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల నందు ఆదివారం మెడ్ స్టార్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ క్యాంపును స్థానిక తెదేపా నేతలతో కలసి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ రాంబాబు, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గత నెల నాలుగో తేదీ నుండి మండల దీక్ష అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం ప్రతిరోజు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. రోజుకి 300 నుంచి భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విరాళాలు అందించి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి, సొసైటీల కార్యద ర్శులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు ధాన్యం కొనుగోలుపై తహశీల్దార్ సురేష్ బాబు ఆదివారం సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో, ఆర్ బికెలలో గోనె సంచులు, రవాణాకు సంబందిం చిన కాంట్రాక్టర్ వివరాలను రైతులకు కనిపించే విధంగా ఉంచాలని తహశీల్దా ర్ తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ ఆర్ బికె లలో అందుబాటులో ఉంటూ వరి కోసిన రైతుల నుండి శాంపుల్స్ తీసు కుని తేమ శాతాన్ని పరిశీలించి సిబ్బం దికి తెలియచేస్తే షెడ్యూల్ ఇస్తారని చెప్పారు. తర్వాత సొసైటీ వారు కొను గోలుచేసే ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ప్రభుత్వమే గోనె సంచులు, రవాణా ఖర్చులు భరిస్తుందన్నారు. కాబట్టి రైతులు హమాలీ ఖర్చులు స్వం తంగా పెట్టుకున్నట్టైతే ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని చెప్పారు. గ్రేడ్ -ఎ రకానికి క్వింటా రూ.2060కు, కామన్ రకానికి క్వింటాకు రూ. 2040కి మద్ద తు ధర ప్రభుత్వం ఇస్తుందని, 21 రో జుల్లో రైతుల ఖాతాలోకి నేరుగా జమ చేయం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తుల చేతిలో రైతులు మోసపో కుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరను వివరించాలని తహ శీల్దార్ ఆర్ బి కె సిబ్బందికి, సొసైటీల కార్యదర్శులకు సూచించారు.

మాట్లాడుతున్న తహసీల్దార్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ కె.వి.ఆర్ కళాశాలలో 1976- 79 సంవత్సరంలో బీకాం చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నందిగామ కాకతీయ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో 43 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసు కున్నారు. ఈ సమావేశంలో కలిసిన పూర్వ విద్యార్థులు కళాశాల జీవితంలో వారి స్మతులను జ్ఞాపకము చేసుకొనుచూ వారి తదుపరి జీవితంలో స్థిరపడటానికి పురోగతి సాధించడానికి ఈ కళాశాలలో వారు నేర్చుకున్న కొన్ని విషయాలు ఎలా దోహదపడ్డాయో సహచరులతో పంచుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కాపా రవీంద్రనాథ్, శ్రీరామచంద్ర మూర్తి, శర్మ, రాజగోపాల్ రావు కి కతజ్ఞతలు తెలిపారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని బలుసుపాడు శ్రీ గురుధామ్ ధర్మక్షేత్రంలో శుక్రవారం నుండి ఆదివారం వరకూ నిర్వహించిన సద్గురు జన్మతిథి, జన్మనక్షత్ర కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తన ప్రవచనాల సారంగా వెలువడిన శ్రీ శివానందరాజయోగం గ్రంధాన్ని వెంకటరమణ, వసంతలక్ష్మి దంపతులు ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక రంగాలను మేళవిస్తూ ప్రపంచానికి వినూత్నమైన సందేశాన్ని అందించిన సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల జీవితమే ఒక రాజయోగ సందేశమని తాత్వికులు గెంటేల వెంకటరమణ అన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గుడివాడ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో 350 మందికి ఉచిత వైద్య పరీక్షలు జరిగినట్లు స్వచ్ఛంద సేవా సంస్థ కష్ణాజిల్లా కార్యదర్శి గుత్తా రమేష్ తెలిపారు. స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాంటిస్సోరి విద్యాసంస్థల కరస్పాండెంట్ పొట్లూరు రమాదేవి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు ఉచితంగా మందులు అందించడం జరిగింది. సంస్థ ఇన్చార్జి చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, అధ్యక్షులు ఉప్పలపాటి మారుతి ప్రసాద్‌రావు, ఎస్. శివశంకర్, గంటా చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలం నాగులూరు గ్రామంలో రైతులు ఆరబెడుతున్న ధాన్యపు రాశులను టిడిపి నాయకులు విజయబాబు, నాగేశ్వరరెడ్డి రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు పడుతున్న ఇక్కట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటికీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం తగదన్నారు. వెంటనే ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

25 నుంచి బంజారా మహా కుంభమేళా

ప్రజాశక్తి-ఎ.కొండూరు

మహారాష్ట్రలోని జలగావు జిల్లా గోధ్రి తండాలో 2023 జనవరి 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు బంజారా మహా కుంభమేళా కార్యక్రమం జరుగుతుందని బంజారాల ఆరాధ్య దైవం అయిన సేవాలాల్ మహారాజ్ ముని మనవడు రామవత్ హనా నాయక్ తెలిపారు. ఆదివారం అఖిల భారత బంజారా మహా సమ్మేళనంలో కార్యక్రమంలో భాగంగా ఏ కొండూరు మండల బంజారా నాయకుల సమావేశం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో ఆరు రోజులపాటు జరిగే మహాసమ్మేళనానికి దేశ విదేశాల నుండి లక్షల్లో బంజారాలు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మహా కుంభమేళాలో బంజారా సంస్కృతి సాంప్రదాయ వేష భాషలు బంజారా సంగీత పరికరాలు వారు ఉపయోగించే యుద్ధ పరికరాలు గురువ్యవస్థ సేవాగడ్ హదీరం గడ్ అనే విషయాలు ఈ ప్రదర్శనలో ఉంటాయన్నారు. ఏ కొండూరు మండలంలో గిరిజనులు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, ఈ ప్రాంతంలో కిడ్నీ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించడం కోసం ఏ కొండూరు మండలంలో కిడ్నీ ఆసుపత్రితో పాటు రీసర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి గోపిరాజు, కష్ణారావు పాలెం ఎంపీటీసీ వెంకటేష్ నాయక్, లావుడియా కష్ణ కిషోర్ నాయక్, ఏడుకొండలరావు పాల్గొన్నారు.

అరకొర నిధులతో

గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-నందిగామ

గ్రామ పంచాయతీలలో అరకొర నిధులతో పనులు చేయలేక సర్పంచులు ఇబ్బందులకు గురౌ తున్నారు. ప్రభుత్వం గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయం కు రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులు వినియోగానికి అనుసరించాల్సిన పక్రియ అసంతృప్తిగా ఉంది. మొట్ట మొదట గడపగడపకు కార్యక్రమం పూర్తి కావాలి. సమస్యలు గుర్తించాలి, వాటిని ఆమోదించాలి. ఇదంతా పూర్తి కావటానికి చాలా సమయం పడుతుంది. అరకొరగా ఇచ్చినా ఇంత పక్రియ ఎందుకని సర్పంచులు అంటు న్నారు. ఎన్టిఆర్ జిల్లా లో 605 పంచాయతీలు ఉన్నాయి. 300 గ్రామ సచివాలయాలలో గడపగ డపకు కార్యక్రమం పూర్తయింది. నందిగామ నియోజక వర్గ స్థాయిలో సుమారు 75 పంచాయతీలు ఉన్నాయి. సుమారు 50 పంచాయతీ లలో ప్రభుత్వ కార్యక్రమం పూర్తయింది. నందిగామ నియోజఖవర్గం లో ఎంఎల్ఎ దషికి వచ్చిన సమస్యలలో కీలకమైన పనులను గుర్తించి ఎంఎల్ఎ, సర్పంచులు,ఎంపిడిఓ, గ్రామ సచివా లయాలలోపు 20 లక్షల విలువైన పనులకు ఆమోదం తెలుపుతున్నారు. నందిగామ మండలంలో పల్లగిరి, అంబారుపేట, ఐతవరం,కేతవీరునిపాడు , చందాపురం ,అడవిరావులపాడు తదితర గ్రామాలలో పనులు గుర్ధించి చేస్తున్నారు. రహదారులు, డ్రయినేజిలు కడుతున్నారు. ప్రస్తుతం పెరిగిన మెటిరియల్ ధరలకు 20 లక్షలు ఏమూలాకు సరిపోవని కొందరు వాపోతున్నారు. గతంలో సర్పంచులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని పంచాయతీ తీర్మానం చేసి పంచాయతీ,ఆర్థిక సంఘాల నిధులతో పనులు చేసే వారు. వెంటనే నిధులు మంజూరు అయ్యేవి. తాగునీరు,పారిశుధ్యం, విద్యుత్తు దీపాలు వగైరా పనులు చేయడానికి కార్యదర్శులు, సర్పంచులకు స్వేచ్ఛ ఉండేది. ప్రస్తుతం 20 లక్షలతో చేసే పనులకు మొదట గుర్తింపు, తీర్మానం, కలెక్టర్ ఆమోదం కోసం సమయం పడుతుంది.

గ్రామాల్లో పూడికలు తీయని డ్రైనేజీలు

చేసిన పనులకు బిల్లులు అవ్వడం లేదు
రవి కిరణ్ రెడ్డి, పల్లగిరి గ్రామ సర్పంచ్

పల్లగిరి గ్రామ సచివాలయం స్లాబు దశలో ఉందని సర్పంచ్ రవి కిరణ్ రెడ్డి పేర్కొన్నారు. పనులు చేసిన బిల్లులు అవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జరిగిన నందిగామ మండల సర్వసభ్య సమావేశంలో పలువురు గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఎంఎల్ఎ దష్టికి తీసుకెళ్లామన్నారు.

గ్రామ పంచాయతీ నిధులు దారి మల్లకూడదు
చలమల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్, మునగాలపల్లి

గ్రామ పంచాయతీలలో నిధులు దారి మల్లకూడదు. ప్రభుత్వం నిధులను గ్రామాల అభివద్ధికి కేటాయించాలని కోరారు. గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం, సిసిరోడ్లు, డ్రయినేజిలు నిర్మించాలి.

అభివృద్ధిలో వివక్ష చూపకూడదు
మాచవరపు రామకోటేశ్వరరావు, టిడిపి నాయకులు, మాగల్లు

ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో అభివద్ధి పనులు చేయటానికి అడ్డంకిగా ఉన్న షరతులు ఎత్తి వేయాలి. అభివద్ధిలో వివక్ష చూప కూడదు. ప్రస్తుతం ఎక్కడ చూసినా గ్రామాలు అభివద్ధికి ఆమాడ దూరంలో ఉన్నాయి. పొలాలకు వెళ్ళే డొంక రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇళ్ళ నిర్మాణం కేటాయింపులో ప్రభుత్వం వివక్ష చూపుతుంది.

మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలి
అడవిరావులపాడు గ్రామ పెద్ద సూరాకొండలరావు

గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కొండలరావు సూచించారు. గతంలో పని చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలి. గడపగడపకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయ భీష్ముడు రోశయ్య : కొల్లు

రోశయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్ గా ప్రజలకు విశేష సేవలు అందించిన మహనీయుడు స్వర్గీయ రోశయ్య అని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పాటు ఆర్థిక మంత్రిగా పనిచేసి 15 సార్లు రాష్ట్ర బడ్జెటు ను ప్రవేశపెట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహనీయుడు రోశయ్య అన్నారు. 2009 సెప్టెంబర్ 3న రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించి రాజకీయ భీష్ముడిగా అన్ని పార్టీల వారిని తనదైన శైలితో కలుపుకుంటూ ముందుకు సాగిన మహనీయుడు రోశయ్య అని కొనియాడారు. తమిళనాడు వంటి కీలక రాష్ట్రానికి గవర్నర్గా అక్కడి ప్రజలకు విశేష సేవలందిం చారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ ప్రతిపక్ష నేత, మరకానికి సమతా కీర్తి, కార్పోరేటర్, దింటకుర్తి సుధాకర్, టిడిపి మచిలీపట్నం నగర కార్పోరేషన్ ప్రధాన కార్యదర్శి, పిప్పళ్ళ వెంకట కాంతారావు, పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కోడూరు : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇండియన్ రెడ్ క్రాస్ కోడూరు మండల శాఖ వారు చేయుత అందించారు. గత కొద్దిరోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురై స్వతంత్రపురం గ్రామానికి చెందిన బొప్పన శ్రీరాములు పూరిల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ కోడూరు మండల శాఖ వారు, కష్ణాజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ వారు అందించిన గహ ఉపకరణ వస్తువులు, కోడూరు శాఖ వారు 26 కేజీల బీపీటి బియ్యం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల శాఖ సభ్యులు వేజెండ్ల శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, జొన్నా రవిశంకర్, రేపల్లె యోగ ప్రకాష్, పిల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసీపీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఉయ్యూరు

కేసీపీ చక్కెర కర్మాగార విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద మసీదు సెంటర్లో డాక్టర్ శివరామకష్ణయ్య హాస్పిటల్ ఆవరణ లో ఏర్పాటుచేసి ఈసమావేశంలో కర్మాగారంలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసి న ఉద్యోగులు, కార్మికులు కలసికొని యోగా ఒకరికొకరి యోగ క్షేమాలు, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. ఉద్యోగ సమయంలో జ్ఞాపకాలు జ్ఞప్తికి తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఎవరెవరు ఏమి చేస్తున్నారు, ఎక్క డ ఉంటున్నారు, కుటుంభ సభ్యులు ఏమిచేస్తున్నారో ఒకరికొకరు తెలుసుకున్నారు. ప్రతి యేటా అందరూ కలసికొని ఉత్సాహంగా గడపడం ఎంతో ఆనందంగా ఉందని ని ర్వాహకులకు కతజ్ఞతలు తెలిపారు. చలమలశెట్టి వీరకోటేశ్వ రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వంద మంది వరకు విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు హాజరుయ్యారు

ధనుర్మాస ఉత్సవ రాట ప్రతిష్ట

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక పాత పురపాలక సంఘ కార్యాలయ సెంటర్లోని శ్రీ కోదండ రామాలయంలో నెలరోజుల పాటు జరిగే ధనుర్మాస మహోత్సవాల ఉత్సవ రాటను దేవస్థాన ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుత్తా శివరామకృష్ణ (చంటి) పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వైకాపా నాయకులు అప్పారావు ఉత్సవ కమిటీ అధ్యక్షులు డొక్కు రాంబాబు, మెరుగుమాల రామకృష్ణ, ఆర్.ప్రసాద్, ఇంజనీర్ శ్రీనివాసరావు, పలువురు లారీ ఓనర్స్ పాల్గొన్నారు.

ఎఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల అత్మీయ కలయిక

ప్రజాశక్తి-గుడివాడ

అక్కినేని నాగేశ్వరరావు కళాశాలకు చెందిన 1976-78 ఇంటర్మీడియట్, సిఇసి సి. సెక్షన్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎఎన్ఆర్ కళాశాల అడిటోరియంలో ఓల్డ్ స్టూడియంట్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు అట్లూరి పరంధామయ్య (ఎపిఎల్‌రావు), ఎస్.నిరంజనరావు, పి.చంద్ర శేఖర్‌ల అధ్వర్యంలో పూర్వవిద్యార్థుల అత్మీయ కలయిను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కాళాశాల కర్యదర్శి కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపల్ పి.జె.ఎస్ కుమార్, పూర్వ ఉపాధ్యయులు రఘువరావులు పాల్గొని పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సభలో పూర్వ విద్యార్థులు

చిననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుని, గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, రాధకృష్ణ, సీతయ్య, దుండు చిన్న, రాజేంద్రప్రసాద్, ప్రస్తుత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : ప్రతి ఒక్కరూ తమ వంతు సేవ చేయాలని, అప్పుడే మన జన్మ సార్థక మవుతుందని గన్నవరం సిఐ కేవివిఎన్ సత్య నారా యణ అన్నారు. ఆదివారం న్యాయవాది తిరువీధి వెంకయ్య దంపతులు ఆయన కార్యాలయంలో నిరుపేద వంద మంది వృద్దులకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చీరలు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి.గౌసాని మాట్లాడుతూ సేవ చేయాలని తత్వం ప్రతి ఒక్కరిలో కలగాలని అప్పుడే మన యొక్క విలువ తెలుస్తుందని అన్నారు. గన్నవరం గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, అమ్మ వద్ధాశ్రమం చైర్మెన్ రాచేటి రూతమ్మ, షేక్ రఫీ, తిరువీధి రంగారావు, తిరువీధి వినోదరావు, కలపాల జక్రయ్య, బోకినాల కోటేశ్వరరావు, అహరోను, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న బూదాటి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గన్నవరం

ప్రభుత్వం వికలాంగుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి దివ్యాంగుల సాధికారత అభివృద్ధి సంక్షేమ సొసైటీ అధ్యక్షులు బూదాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం గన్నవరంలోని సొసైటీ కార్యాలయంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అర్హులైన వికలాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ట్రై సైకిళ్లు, ఇతర ఉపకరణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చదువుకొని అర్హత ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చి అవకాశం కల్పించాలన్నారు. అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వడంలో చొరవ చూపించాలన్నారు. కొంతమందికి వికలాంగత్వం ఉన్న తక్కువ చూపించడం వల్ల వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు ఎస్కే చాందిని, మహిళా మిత్ర సుజాత, సొసైటీ కార్యదర్శి పచ్చి గళ్ళ భాస్కరరావు, కోశాధికారి కరుణాకర్ రావు, ఎమ్మార్పీఎస్ నాయకులు రాచేటి మురళి పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ ముసుగులో ఆస్తులు అమ్మడం తగదు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్వలాభం కోసం రియల్ ఎస్టేట్ ముసుగులో కొందరు హిందూ అనుబంధ సంస్థల ఆస్తు లను అమ్ముకోవటం కోసం ప్రయత్నిస్తున్నారని ప్రముఖ న్యాయవాది బూరగడ్డ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ కళాశాల నిర్మాణం సొసైటీల చట్టం కింద నమోదు చేయబడిందని అన్నారు. సొసైటీ చట్టాల ప్రకారం హిందూ కళాశాల, దాని అనుబంధ సంస్థల ఆస్తులను విక్రయించే హక్కు ఎవరికీ లేదన్నారు. అయితే స్వలాభం కోసం రియల్ ఎస్టేట్ ముసుగులో ఆస్తులను అమ్ముకోవాలని కొందరు చూస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న పోల్‌నాయుడు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మోపిదేవి

సిఐటియు మోపిదేవి నాలుగవ మండలం మహాసభ ఆదివారం సాయంత్రం మోపిదేవి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. పోల్‌నాయుడు కార్మిక వర్గాల సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. శీలం నారాయణరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, శ్రామికుల బాధ్యతలు, హక్కులు తదితర అంశాలకు ప్రసంగించారు. అనంతరం మోపిదేవి మండల సిఐటియు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గపు అధ్యక్షు లుగా ఆరేపల్లి వెంకటసుబ్బలక్ష్మి, కార్యదర్శిగా సిరివెళ్ల రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా కోసూరు విజయలక్ష్మి, కర్లంపూడి కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎం ప్రకాష్, మరియు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, సిఐటియు సభ్యులు నాయకులు బండి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణ నిధులు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించిన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోవటానికి ఇస్తున్న డబ్బులను 1.80 లక్షల నుండి 5 లక్షల రూపాయలకు పెంచాలని కోరుతూ సిపిఎం లబ్ధిదారుల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల క్రితం రేట్లు ఇప్పుడు లేవని, ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుకలు, కూలి తదితర అన్ని మూడు రెట్ల పెరిగాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.8 లక్షలకు పునాది మాత్రమే పూర్తవుతుందని, ఇల్లు (డాబా)పూర్తవ్వ టానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ ప్లాట్లు తీసుకొంటామని బెదిరిస్తున్నారని, గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివద్ధి పోరాట కమిటీ నాయకులు మద్దెల రమణ, మద్దె లక్ష్మీ,సరాకటి బాలమ్మ, ఎస్.మాణిక్యం, ఎస్.వీరాజు,సజ్జ పోశమ్మ, మద్దెల కామేశ్వరరావు, మేడా ప్రభు,మెడా నాగరత్నం, మే డా నారయ్య,సజ్జా సరిత, ప్లంబర్ యూనియన్ కార్యదర్శి రామకష్ణ, అధ్యక్షులు బి.కోటేశ్వరరావు, పెయింటింగ్ యూనియన్ అధ్యక్షుడు రావాడ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దృశ్యం

టాక్స్ ప్రాక్టీషనర్లకు నిరంతర పునఃశ్చరణ అవసరం

● ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

టాక్స్ ప్రాక్టీషనర్లకు నిరంతర పునఃశ్చరణ ఎంతో అవసరమని ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్ అన్నారు. మారుతున్న పన్నుల విధానం పట్ల అవగాహన పెంచుకొనేందుకు శిక్షణ ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్స్ అసోసియేషన్, ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పరోక్ష పన్నుల అంశంపై ఒకరోజు సదస్సు ఎంబివికె భవన్ లో నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గిరిజా శంకర్ అసోసియేషన్ సావనీర్‌ను ఆయన విడుదల చేసారు. అనంతరం ఇరు అసోసియేషన్ల ప్రతినిధులు చీఫ్ కమిషనర్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టాక్స్ ప్రాక్టీషనర్లకు పన్నుల విధానం పట్ల ఎప్పటికప్పుడు పరిజ్ఞానం అవసరమని అన్నారు. నిజమైన పన్ను చెల్లింపు దారులకు ఇబ్బంది కల్గించకూడా చూడటంతో పాటు అదే సమయంలో పన్ను ఎగవేత దారుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.షరీఫ్ ఖాన్, మాట్లాడుతూ టాక్స్ ప్రాక్టీషనర్లకు ఉన్న ఇబ్బందులపై చర్చించి తమకు వత్తిపరంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఈ తరహా సదస్సులు ఉపకరిస్తాయని అన్నారు. సమస్యల వల్ల టాక్స్ ప్రాక్టీషనర్లు మానసిక ఒత్తిడికి గురై అకాల మత్యువాత పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లింపు దారుల సమస్యల పట్ల కమిషనర్ గిరిజ శంకర్ సానుకూలంగా స్పందించారని వివరించారు.

సత్యమ్మను దర్శించుకున్న తెలంగాణ మంత్రి

మంత్రి పువ్వాడకు పుష్పగుచ్చం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ మండలం అంబారుపేట లో గల కొలువై ఉన్న సత్యమ్మ అమ్మవారిని ఆదివారం తెలంగాణ మంత్రి పువ్వాడ అజయ్ దంపతులు దర్శించుకున్నారు.ఆలయ ఈవో సిబ్బంది , వైఎస్ఆర్సిపి నాయకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సత్తెమ్మ తల్లి ఆలయంలో పువ్వాడ అజయ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన గెలుపు కోసం తన మిత్రుడు మొక్కుకున్న మొక్కును చెల్లించుకునేందుకు రావటం జరిగిందని మంత్రి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు మంత్రిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు పాలేటి సతీష్,వైసిపి నాయకులు చిరుమామిళ్ళ అశోక్, నాదెండ్ల నరేంద్ర, మాజీ జడ్పిటిసి వాసిరెడ్డి ప్రసాద్,మాజీ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం వితరణ

నిర్మాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామానికి చెందిన గండికోట సుబ్బయ్య కుమారుడు గండికోట కష్ణయ్య తన సొంత ఎనిమిది సెంట్లు స్థలాన్ని హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఇవ్వడం అభినందనీయమని, ఎన్ఆర్ఐజీసీ నిధులతో బిల్డింగు నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని మాజీ జెడ్పిటిసి చల్లా దర్గా వైకుంఠ రావు ఒక ప్రకటనలో పేర్కొనరు. ఆదివారం బిల్డింగ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య తో కలిసి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా చల్లా వైకుంఠ రావు మాట్లాడుతూ 18 లక్షల రూపాయల నిధులతో నిర్మించే బిల్లింగును త్వరలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థల ధాత కష్ణమూర్తి, బూత్ కన్వీనర్ గుడారు పుల్లయ్య, గ్రామ వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు ఆనంగి శ్రీనివాస్ యాదవ్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యాద్రగొల్ల కోటేశ్వరరావు, గుమ్మ శివకష్ణ పాల్గొన్నారు

ఈత పోటీల్లో జగ్గయ్యపేట బాలల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఈత పోటీల్లో జగ్గయ్యపేట డ్రీమర్స్ విన్నర్స్ అసోసియేషన్ బాలలు విశేష ప్రతిభ ప్రదర్శించారు. ఇరువురు ఇంటర్ డిస్టిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడ లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ లో 1, 2, 3 గ్రూప్స్ నందు 10 నుండి 17 సంవత్సరాల వయసు గల బాల, బాలికలకు నిర్వహించిన ఈత పోటీలలో జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ టీం మేనేజర్ అన్నంనేని కళ్యాణ్, కోచ్ పొట్టాబత్తిన సందీప్ ఆధ్వర్యంలో బాలబాలికలు టి యం చరణ్ తేజ, డి రోమన సఫీరా, ఏ. తనిష్క, బి. భవ్య సాయిశ్రీ పోటీలలో పాల్గొన్నారు. వీరిలో టీఎం. చరణ్ తేజ, ఏ. తనుష్క ఈనెల10,11 తేదీ ఏలూరులో జరిగే 7 వ ఇంటర్ డిస్టిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు సెలెక్ట్ అయ్యారు. ఈ పోటీల్లో కూడా విజయం సాధించిన వారు త్రివేండ్రంలో జరిగే ఆల్ ఇండియా పోటీలకు అర్హత పొందుతారని టీం మేనేజర్ అన్నంనేని కళ్యాణ్, కోచ్ పొట్టాబత్తిన సందీప్ తెలిపారు. ప్రతిభ ప్రదర్శించినబాలలను డ్రీమర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలాలి నరేష్ కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండు రంగారావు, లక్ష్మి తదితర సీనియర్ స్విమ్మర్స్ అభినందించారు.

రాం ప్రదీప్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి- తిరువూరు : భారత దేశం నా మాతభూమి ప్రతిజ్ఞని రచించడం ద్వారా పైడిమర్రి వెంకట సుబ్బారావు విద్యార్థులకు మంచి సందేశం ఇచ్చారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్, తెలుగు భా షా వికాస సమితి అధ్యక్షులు టి.ఉమా మహేశ్వరరావు అన్నారు. దేశంలోనే తొలి పైడిమర్రి విగ్రహాన్ని మండల పరి ధిలోని మల్లెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేయడానికి కషి చేసిన జెవివి ప్రతినిధి ఎం.రాం ప్రదీప్ కు గుర్తింపుగా తెలుగు బుక్ ఆ ఫ్ రికార్డ్స్ ప్రతినిధి వెంకటాచారి జారీ చేసిన ధవీకరణ పత్రాన్ని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో అందజేశారు. ఈకార్యక్రమంలో మల్లెల సొసైటీ అధ్యక్షుడు కలకొండ రవి కుమార్, జెవి వి మండల కార్యదర్శి కె.పాపారావు, గ్రంథాలయ అధికారిణి కె.పద్మావతి పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం సంఘటితం కావాలి

● బీసీల రౌండ్‌టేబుల్ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : 2024లో బిసిలకు రాజ్యాధికారం లభించే విధంగా ప్రతి ఒక్కరూ సంఘటితం కావాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా నగరంలోని అలంకార్ ఇన్‌లో బిసి నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పక్షాలు బిసిలను మోసం చేస్తున్నాయన్నారు. 10 శాతం రిజర్వేషన్ పేరుతో మెల్లగా రిజర్వేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేయబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలలో ఉన్న పేద ప్రజలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం భారత రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. 85 శాతం ఉన్న బిసి వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రశ్నించడం లేదన్నారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే కుల గణన చేసి నిర్ధారణ చేసి దానిపై కమీషన్ వేయాలన్నారు. ఆర్థిక అంశం తీసుకుని రిజర్వేషన్ ఇవ్వడం సరికాదన్నారు. కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్ష నాయకులు ఒక బిసికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వలేరా అని ప్రశ్నించారు. తాము ఎప్పుడు పల్లకి మోయట మేనా ఈసారి పల్లకి ఎక్కాలన్నారు. అందుకు రానున్న ఎన్నికలే నాంది కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాజీ ఎంఎల్‌సి కోదాడ రాజయ్య, రిటైర్డ్ ఐపీఎస్ హరికుమార్, బిసి సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్, జనరల్ సెక్రటరీ అన్నవరపు నాగమల్లిరాజు, బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు డాక్టర్ శేషయ్య పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-నందిగామ : గీతా జయంతి సందర్భంగా ఆదివారం నందిగామ పట్టణం గీతా మందిర్ సెంటర్‌లో అన్నదానం చేశారు. కేశినేని ట్రస్టు నిర్వాహకులు కేశినేని చిన్ని, నందిగామ మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య 10వ వార్డు కౌన్సిలర్ మండవ కష్ణకుమారి,గీతా మందిర్ చైర్మన్ నల్లాని సత్యనారాయణ కమిటీ సభ్యులు రాటకొండ శివరామకష్ణ, రామిరెడ్డి శ్రీధర్, తెదేపా నేతలు మరియు కేశినేని శివనాథ్ (చిన్ని),మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య కలిసి జయంతి ఉత్సవాలను తిలకించి అనంతరం అన్నదానం చేశారు.

గోతులమయంగా గ్రామీణ రహదారులు

● ప్రయాణీకుల తీవ్ర ఇబ్బందులు

గతుకులమయంగా రహదారి

కంపచెట్లతో మూసుకుపోయిన మేడూరు గాదవారిగూడెం బిటి రోడ్డు

ప్రజాశక్తి-గంపలగూడెం

మండలంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా మారాయి . రహదారులు గుంటలు, గుంటలుగా మారటంతో ఎక్కడపడితే అక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు వచ్చి పోవాలంటే వాహనదారులు, పాత చారుల సైతం పడుతున్న ఇబ్బందులు చెప్పరానివిగా ఉన్నాయి. మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు మొత్తం 33 ఉండగా... ఇందులో ఆరు బీటీ రహదారులుగా రూపాంతరం చెందాయి. కానీ అవి కూడా పునర్నిర్మాణానికి ఎదురుచూస్తున్నాయి. ఇందులో లింగాల నుండి (వయా సుబ్బాల) ఆర్లపాడు రహదారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. నిత్యం వ్యవసాయదారులు వాహనదారులతో ఆ రహదారి రద్దీగా ఉంటుంది. మూడున్నర కిలోమీటర్లు పొడవు గల ఈ రహదారి ఎప్పుడు వేస్తారా అని ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా దుందిరాలపాడు నుండి సిరిపురం రోడ్డు నాలుగు కిలోమీటర్ల పొడవున ఇదే స్థితిని తలపిస్తుంది . ఆర్లపాడు నుండి చేనుకొమిర వరకు గల రెండున్నర కిలోమీటర్ల రహదారి తారు నిర్మాణానికి సిద్ధంగా ఉంది. నూజివీడు నుండి నుండి గంపలగూడెం కొత్తపల్లి బీటీ రోడ్డు 3.6 కిలోమీటర్లు పొడవునా ఏ రెండు గజాలు సరిగా లేనందున దాదాపు 6 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంపలగూడెం నుండి గాదేవారిగూడెం ఏడు కిలోమీటర్లు పొడవున రహదారి (వయా మేడూరు) ఉన్నప్పటికీ ఏపుగా కంపచెట్లతో నిండిపోవడంతో ప్రయాణానికి అసౌకర్యంగా మారి, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్లపాడు నుండి చిన్న కోరుకొండి రెండున్నర కిలోమీటర్ల రహదారి గుంతలుగా మారింది. అనుముల్లంక నుండి గట్టు చెరువు రెండున్నర కిలోమీటర్లు పొడవున్న ఈ రహదారి అంతంత మాత్రంగానే ఉంది. గత ఏడు నుండి ఎనిమిది సంవత్సరాలు నుండి ఈ రహదారులు పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పనులు వెంటనే ప్రారంభించి ప్రజల సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుచున్నారు. అంతేకాదు మండలంలో ఉన్న 33 గ్రామీణ రహదారులు పునర్నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయని, తగిన రీతిలో మరమత్తులైన చేపట్టాలని ప్రయాణికులు కోరుచున్నారు

ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌దే విజయం

సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్‌టియు బలపర్చిన ప్యానల్‌కు ఆధిక్యత

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ విజయదుందుభి మోగించింది. అత్యధిక సంఖ్యలో డైరెక్టర్లను ఈ ప్యానల్ కైవసం చేసుకుంది. కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తన ఆధిక్యతను ప్రదర్శించింది. హనుమాన్‌పేటలోని జంధ్యాల దక్షిణామూర్తి మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోలాహలంగా జరిగాయి. రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎంజె ఏసుదాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పోలింగ్ అనంతరం 3.30 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమైంది. రాత్రి 10 గంటల తరువాత కూడా కౌంటింగ్ నడిచింది. మూడు బూత్‌ల్లో పోలైన 1232 ఓట్లను ప్రతి రౌండ్‌కు 25 ఓట్లు చొప్పున 16 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. తొలి నుంచి చివరి వరకు ప్రతి రౌండ్‌లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులే ఆధిక్యతను చాటారు. మొత్తం 16 రౌండ్లకు గాను 8 రౌండ్ల కౌంటింగ్ పూర్తియ్యే సరికి 1,2 బూత్‌లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులు 9 మంది ఆధిక్యతలో ఉండగా, ఈశ్వర్ ప్యానల్ ఇద్దరు ఆధిక్యతలో ఉన్నారు. మూడో బూత్ లెక్కింపులో అజయ్‌ప్యానల్ 10 మంది ఆధిక్యతను ప్రదర్శించగా, ఈ బూత్‌లో ఈశ్వర్ ప్యానల్ ఒక్కరే ఆధిక్యతలో ఉన్నారు. 10వ రౌండ్‌లో కూడా 9 మంది ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధిక్యతలో ఉండగా, ఈశ్వర్‌ప్యానల్ ఇద్దరు ఆధిక్యతలో ఉన్నారు. 14వ రౌండ్‌లో కూడా ఇదే ఆధిక్యతను ఫ్రంట్ కనబర్చింది. మొత్తం 1536 ఓట్లకు గాను 1232 ఓట్లు

ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

పోలయ్యాయి. సిటింగ్ ప్యానల్ 'ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్, ఈశ్వర్ ప్యానల్, విఎంసి ఎంప్లాయీస్ మినిస్టీరియల్ అండ్ ఆల్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ పోటీ చేయగా, ఈ ఎన్నికల్లో మూడవ ప్యానల్ అంతగా ప్రభావం చూపించ లేకపోయింది. కొన్ని ఓట్లకే పరిమితం అయింది. ఈశ్వర్ ప్యానల్ కూడా గతంలో ఉన్న డైరెక్టర్లను కూడా నిలబెట్టుకోలేకపోయిందని తెలుస్తుంది. గత సారి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుతం సిటింగ్ ప్యానల్‌గా ఉన్న ప్రోగ్రెసివ్ ప్యానల్‌కు 6 డైరెక్టర్లు ఉండగా, ఈశ్వర్‌ప్యానల్ ఐదుగురు ఉన్నారు. ఈ సారి అత్యధిక డైరెక్టర్లను సిటింగ్ ప్యానల్ అయిన ప్రోగ్రెసివ్ ప్యానల్ కైవసం చేసుకుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన దగ్గర నుంచి పోలింగ్ సమయం వరకు కూడా ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్రణాళికాబద్ధమైన ప్రచారంతో పాటు వీరికి మద్దతు నిచ్చిన సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్‌టియు, ఇతర మిత్రులను కలుపుకొని ఉద్యోగ, కార్మికుల్లో పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు. బ్యాంక్ కార్యకలాపాలను నిర్వహించడంలో కానీ, బ్యాంక్ సభ్యులకు లోను సదుపాయం కల్పించడంలో, ఇతర సదుపాయాలు కల్పించడంలో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ గడిచిన ఈ ఐదేళలో ఓటర్లలో ఒక నమ్మకాన్ని కల్పించడంలో విజయవంతం అయ్యారని ప్రస్తుతం సాధించిన విజయమే నిదర్శనంగా నిలుస్తుంది. ప్రతి రౌండ్‌లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులు ముందంజలో ఉండటంతో ఇక లాభం లేదని ఈశ్వర్‌ప్యానల్ అభ్యర్థులు కౌంటింగ్ మధ్యలో నుంచే బయటకు వెళ్లిపోయారు. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ విజయం పట్ల సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు హర్షం ప్రకటించారు. ఓటర్ల నుంచి వ్యక్తం అవుతున్న అభిప్రాయాన్ని బట్టి ఈ సారి కూడా తామే ఆధిక్యత సాధిస్తామని ముందుస్తు నుంచే ఊపును ప్రదర్శిస్తున్న ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆదివారం రాత్రి 6,7 గంటల నుంచే కౌంటింగ్ జరుగుతున్న ఏరియాలో ఆ ప్యానల్ బలపరిచిన ట్రేడ్ యూనియన్లు, ఉపాధ్యాయ సంఘాలు, వారి మద్దతు దారులు, ఉద్యోగ, కార్మికులతో కోలాహలంగా సందడి నెలకొన్నది. 10వ రౌండ్ లెక్కింపు దగ్గర నుంచే ప్రోగ్రెసివ్ ఫ్రంట్ మద్దతుదారులు గులాములు సిద్ధం చేసుకున్నారు. అత్యధిక డైరెక్టర్లు గెలిచినట్లు తెలియడంతో ఫ్రంట్ మద్దతు దారుల ఉత్సాహం ఉరకలేసింది. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. గెలుపొందిన డైరెక్టర్లందరికీ ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

పాము కాటుతో బాలుడు మృతి

ప్రజాశక్తి-ఘంటసాల

పాము కరిచి సంవత్సరన్నర బాలుడు మతి చెందిన సంఘటన ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు బీసీ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం చిట్టూర్పు బీసీ కాలనీకి చెందిన యర్రవరపు బసవేశ్వరరావు - సాయి శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడైన కార్తికేయ ఇంట్లో నిద్రిస్తుండగా, ఆదివారం తెల్లవారుజామున రక్తపింజరు పాము కాటు వేయటంతో ఒక్కసారిగా బాలుడు ఏడ్చాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడి దగ్గరకు వచ్చి చూడగా పాము కనిపించింది. హుటాహుటీన తల్లిదండ్రులు బాలుడిని చికిత్స నిమిత్తం చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మచిలీపట్నం, ఆతర్వాత విజయవాడ తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. బాలుడి తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, తండ్రి తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సంవత్సరన్న బాలుడు మతి చెందటంతో బీసీ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుడి మతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

గొయ్యిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డుపై గుంతను పూడ్చాలి : సిపిఎం

మొవ్వ : మొవ్వ మండలం అవురుపూడి సెంటరులో ఆర్ అండ్‌బి రహదారిపై ఏర్పడిన పెద్ద గొయ్యికి తక్షణమే మరమ్మతులు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మెయిన్ సెంటరులో ఏర్పడిన ఈ గొయ్యితో వాహనదారులు, స్కూలు బస్సులు, ఎడ్లబండ్లకు ప్రమాదాలు జరగటానికి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాత్రిపూట గోతుల్లో వాహనాలు పడిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ గొయ్యి గురించి పట్టించుకోకపోవటం దారుణమని ఖండించారు. గొయ్యిని నారాయణరావు, హనుమంత, శ్రీనివాసరావు పరిశీలించారు.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలన అధ్వానం : టిడిపి

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ పాలన అత్యంత అధ్వానంగా తయారైందని పలువురు టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' పేరుతో ఆ పార్టీ నాయకులు ఆదివారంనాడు ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రజల గోడు ఏమాత్రం పట్టించుకోకవటం లేదని విమర్శించారు. గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాదలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గుడివాడ :** కేంద్ర, రాష్ట్ర నిధులకు తేడా తెలియని కొడాలి నాని నాలుగుసార్లు గెలవడం గుడివాడకు పట్టిన దరిద్రమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని 10,11,19,30, వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. టిడిపి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్, నియోజకవర్గ అధ్యక్షుడు గోవాద శివా, నాయకులు సయ్యద్ జెబిన్, యాసిన్, గోకవరపు సునీల్, కంచర్ల సుధాకార్, షేక్ జానీ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో బంటుమిల్లి మండలంలోని ఆముదాలపల్లి, రామవరపు మోడీ గ్రామాల్లో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. టిడిపి పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. టిడిపి మండల అధ్యక్షుడు వీరబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా కాశీ, రాష్ట్ర బిసి విభాగం కార్య దర్శి బొల్లా వెంకన్న, పార్లమెంట్ కార్యదర్శి కూనసాని చిన్న, ప్రవీణ్ కుమార్, ఆముదాల సర్పంచ్ రవి చాంద్, ఉప సర్పంచ్ వెంకట రామన్, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ చిలుకూరి వెంకటేశ్వరరావు, నియోజక వర్గ టిఎన్‌టియుసి అధ్యక్షులు శ్రీను, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్య దర్శి ధన శ్రీరామమూర్తి, యూనిట్ ఇన్‌ఛార్జి బడుగు వెంకటేశ్వరరావు, బూత్ కన్వీనర్ రాజులపాటి మధు,, నరేష్, ఎస్‌సి విభాగం నాయకులు దాసరి ప్రసాద్, విజయ్, కట్టా రమణయ్య, కట్టా శేషగిరి, ఆకునూరి రత్నకుమార్, ఉదుముల నరేష్, దోనే నానాజీ, కట్టా స్వామీ, నాని, జాక్కరయ్య, మీడియా కో ఆర్డినేటర్ సాయి, నాగేశ్వరావు పేట సర్పంచ్ తాతా రాజా, పాలడుగు వెంకటేశ్వరరావు, వీరంకి రాజారావు ,శేషు,రవి,శివారెడ్డి,రాధాకృష్ణ, సుధాకర్, తెనాలి సుధాకర్, వన్నెరెడ్డి కొండ, గుర్రం వెంకన్న, జంపాని సూరి, మోడీ మాజీ సర్పంచ్ శ్రీను పాల్గొన్నారు.

బంటుమిల్లిలో

విద్యతోనే సామాజిక అభివృద్ధి : సామినేని

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

విద్యలో రాణించటం ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కాపు సామాజిక తరగతి వారి ఎదుగుదల సాధ్యమని ప్రభుత్వ విప్, జగ్గయ్య పేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. హనుమాన్ జంక్షన్ పట్టణ, బాపులపాడు మండల కాపు వన సమారాధన స్థానిక విజయవాడరోడ్డులోని డాక్టర్ దుట్టా శివశంకర్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సామినేని మాట్లాడుతూ కాపు సామాజిక తరగతి వారు ఐకమత్యంతో మెలగాలని సూచించారు. ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి, వ్యాపార ఏర్పాటు, విదేశీ విద్యకు ప్రభుత్వం రుణ సదుపాయాన్ని అందిస్తుందన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వైఎస్సార్

మాట్లాడుతున్న ఉదయభాను

సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు మాట్లాడారు. కాపులంతా ఒకరికొకరు తోడ్పాటును అందించుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధి సాధించాలన్నారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్ ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన గన్నవరం నియోజకవర్గ నాయకుడు చలమలశెట్టి రమేష్, వైఎస్సార్ సీపీ పెదపాడు మండల అధ్యక్షుడు అప్పన కనకదుర్గా ప్రసాద్, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కేతినీడి జైనేంద్ర కుమార్, శ్రీ కృష్ణా థియేటర్ అధినేత చింతా వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ ఏజన్సీస్ అధినేత నూలు నరసింహారావు, శేరి నరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు, బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు హాజరయ్యారు. తొలుత చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పాటలు ఆకట్టుకున్నాయి. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ లో ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థి చలమలశెట్టి రామ్ చరణ్‌కు ఫీజు నిమిత్తం రూ. 1.65 లక్షల ఆర్థిక సాయాన్ని అంజేశారు.

ఉద్యోగ భద్రత కోసం సమరశీల పోరాటం

ప్రజాశక్తి - గుడివాడ

ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు గుడివాడ పట్టణ కమిటీ ఎనిమిదో

మాట్లాడుతున్న చౌటపల్లి రవి

మహాసభ ధనికొండ ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చౌటపల్లి రవి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి లక్ష్మణరావు, ఉపాధ్యక్షులుగా ఆర్ సి పి రెడ్డి, రేపానికొండలు, సహాయ కార్యదర్శులుగా చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, నిమ్మగడ్డ రామ తులసి, కోశాధికారిగా బొంతు వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా రెడ్డి నాగరాజు (ఆటోనగర్), శ్రీనివాసరావు (పంచాయతీ), పి.ప్రభు దాస్ (విగ్నేశ్వర ముఠా), భక్తుల నాగరాజు (బిల్డింగ్), చిన్ని నరసయ్య (బిల్డింగ్), ఉమ్మలేటి నాగ సురేష్ (బిల్డింగ్), భవాని (ప్లాట్‌ఫామ్ రిక్షా), బందారు కృష్ణ (స్లాబ్ ముఠా) ఎన్నికయ్యారు.

బిసి గర్జన పెట్టే అర్హత జగన్‌కు లేదు : బుద్ధా

ప్రజాశక్తి-వన్‌టౌన్: బిసిల గర్జన పెట్టే అర్హత జగన్‌కి లేదని,

అబద్దాలు, అసత్యాలతో ప్రచారం కోసమే గర్జన సభ ఏర్పాటు చేస్తున్నారని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుద్ధా వెంకన్న మాట్లాడుతూ బిసి కార్పొరేషన్‌లు పెట్టిన జగన్ ఒక్క రూపాయి అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు. బిసిలకు మొదటి నుంచీ అండగా ఉన్న ఏకైక పార్టీ టిడిపి అని, బిసిలను మోసం చేసిన పార్టీ వైసిపి అని అన్నారు. ఇది తెలుసుకునే ప్రజలు చంద్రబాబు సభలకు భారీగా తరలి వస్తున్నారని అన్నారు. చంద్రబాబు రోడ్డు షోలకు వచ్చే ప్రజలను చూసి వైసిపి కుక్కలు మొరుగుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రలోని 34 సీట్లలో ఒక్క సీటు వైసిపికి వచ్చినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు.

ఎపి సగర సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఏడుకొండలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎపి సగర సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా విజయవాడకు చెందిన సాదరబోయిన ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా గుంటల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులో

జరిగిన రాష్ట్ర సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశం వివరాలను ఏడుకొండలు వివరిస్తూ సగర కులస్తులను ప్రస్తుతమున్న బీసీ డీ జాబితా నుంచి బీసీ ఏ జాబితాలోకి మార్చాలన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని సగర కులస్తులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగర కులస్తులకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమం

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

మాట్లాడుతున్న భాస్కరయ్య

విజయవాడ : రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య అన్నారు. రజక వత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ నగర రజక ముఖ్యుల సమావేశం స్థానిక బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి కార్పొరేషన్లకు విధివిధానాలు లేకుండా ఒక్క రూపాయి కూడా ఇవ్వని పాలకులు బిసిలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలో ఉన్న ధోబి ఘాట్స్ వద్ద సరైన సౌకర్యాలు లేక వృత్తిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రజక వృత్తిదారుల కుటుంబాలు ఇంటి అద్దెలు కట్టలేక సతమతమవుతున్నారన్నారు. ధోబి ఘాట్ల వద్ద అధునాతనమైన యంత్రాలు ఏర్పాటు చేసి రజక వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 17 మందితో ఏకగ్రీవంగా కమిటీ ఎన్నికైంది,. విజయవాడ నగర కమిటీ అధ్యక్షురాలిగా లింగాల నిర్మలమ్మ, కార్యదర్శిగా కోరట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ, సోంపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కాజా గురుమూర్తి, సత్యనారాయణ, పార్వతి, కోశాధికారిగా, రెడ్డిపల్లి శివ పార్వతి తదితరులతో కమిటీ ఏర్పాటైంది. ఈ సమావేవంలో మాజీ కార్పొరేటర్లు దోనేపూడి కాశీనాథ్, సరోజ, మురహరి చిక్కవరపు, వెంకటరెడ్డి, గురుమూర్తి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురాతన కల్యాణ వేదిక తొలగింపు సరికాదు

ప్రజాశక్తి-వన్‌టౌన్: వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కొత్తపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలోని అతి పురాతనమైన కల్యాణ వేదికను తొలగించడాన్ని ఆలయ వారసులు పితాని నరసింహారావు, పితాని దుర్గారావు ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం దేవాలయం సమీపంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పురాతన శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసుకోమని స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అప్పగిస్తే ప్రస్తుత పాలక మండలి తప్పుడు నిర్ణయాలు చేయడం సరికాదన్నారు. గుడిని అభివద్ధి పరచకుండా ఆదాయం వంకతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని తలపెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పాలకమండలికి చిత్తశుద్ధి ఉంటే యాత్రికులు అత్యధికంగా దేవాలయానికి వచ్చి పూజలు చేసుకునే విధంగా ఏర్పాటు

చేయాలి తప్ప ఆదాయం కోసం చూడకూడదన్నారు. ప్రతి ఏటా స్వామివారి కల్యాణం కల్యాణ వేదికలోనే నిర్వహించేవారని, అదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిలాని నరసింహారావు, కిలాని దుర్గారావు, భూరా భాస్కర్ యాదవ్, బొబ్బిలి దుర్గారావు యాదవ్, ఒమ్మి యర్రారావు యాదవ్, బోను నరేష్ యాదవ్, సారిపల్లి క్రాంతి కూమర్, బోను జయశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో చిన్నారులు

విజయవాడ: పర్యావరణ పరిరక్షణ సంస్థ 'అవార' ఆధ్వర్యంలో ప్రకృతిలో పిల్లల శిబిరం రాజధాని గ్రామ పరిసరాల్లోని కృష్ణానది తీరాన ఆదివారం జరిగింది. పలువురు చిన్నారులు అరవింద పాఠశాల విద్యార్థులతో చేరి చెత్త ఏరి – కలుపు పీకి – మొక్కలు నాటే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా వచ్చిన నాగార్జున హాస్పిటల్ కార్యనిర్వహణాధికారి విశ్వమోహన్, రెయిన్బో చిన్నారుల ఆసుపత్రి సీనియర్ నిర్వహణాధికారి రావి శ్రీనివాస్ చిన్నారులను అభినందించారు. అధ్యాపకురాలు షారొన్, కెఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహర్ష సమన్వయపరిచిన ఈ కార్యక్రమంలో శిరీష, ఆశ్రిత పాల్గొన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం ఆరు గంటలకే నిరాటంకంగా మొదలయ్యే ఈ ప్రకృతిలో పిల్లల శిబిరంలో పాల్గొనదలచిన ఆసక్తి గల తల్లిదండ్రులు 9494126812కు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

PUBLIC NOTICE

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
Honourable Justice Sri Chikati Manavendranadh Roy (14th COURT)
ELECTION PETITION NO 1 OF 2019

Between:
Yarlagadda Venkata Rao
S/o Y.Rama Seshagiri Rao ...Petitioner
AND
1) Addanki Amos, S/o Yesu Ratnam, D.No.5-49A, Harijanawada, Gannavaram, Krishna District, Andhra Pradesh. (R6)
2) Kalaparti Bhaskar Rao, S/o Ayyappa(Late), R/o D.No.6-130 FF/2, Gayathri Nivas, Gannavaram, Krishna District, Andhra Pradesh. (R10)

As Per The Direction's of Honourable High Court Of Andhra Pradesh At Amaravathi. This Public Notice Issued by me Stating That The above Election Petition No 1 of 2019 at Honourble Sri Justice Chikati Manavendranadh Roy Court(14th Court) Was Posted on 2nd week of december 2022. For the appearance of above Stated R6 and R10. Please Attend Without Fail Otherwise Honourable Court tasking Necessary Steps Against Both of You, Hence This Public Notice.
Place:-Vijayawada
Date:2-12-2022

Your's Sincerely,
V.C.H Naidu,
Kiran Babu Tagaram,
Advocates For Petitioner.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విజయవాడ బ్రాంచి ఆఫీసులు -
బోడెమ్మ హోటల్ ప్రక్కన, బి ఆర్ పి రోడ్, 1 టౌన్.
శ్రీ కృష్ణ నిలయం, విజయబ్యాంక్ పైన, గవర్నర్‌పేట.
జమ్మిచెట్టు సెంటర్, మోడరన్ అకాడమీ కాలేజి ప్రక్కన, మొఘల్‌రాజపురం.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 27.12.2022 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1734.66 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

మొదటిపేజీ తరువాయి

ఘనంగా ఘంటసాల శత జయంతి ఉత్సవాలు

సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ష విజ్ఞాన పరిషత్ సభ్యులు, టేకుపల్లి శ్రీ రామేశ్వర స్వామి వారి ఆలయం ట్రస్టీ యడవల్లి నీల లోహిత శాస్త్రి, దివి ఎఎంసి మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, ఘంటసాల సినీ సాహిత్య రంగానికి చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినీ విజ్ఞాన విశారద ఎస్ వి రామారావు, గ్రామ సర్పంచ్ ఎర్రంశెట్టి ధన రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు నడకుదిటి జననీ కుమారి, మండల పరిషత్ అధ్యక్షులు రావి దుర్గా వాణి, ప్రముఖ రంగస్థలం సిని నటులు శ్రీ ఉప్పులూరి సుబ్బరాయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ఘంటసాల ఇప్పటికీ, ఎప్పటికీ ప్రజల హదయాల్లో ఆయన ఆలపించిన పాటల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఘంటసాల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నం నగర కార్పొరేషన్ మున్సిపల్ ప్రధాన పార్క్ పక్కన గల ఘంటసాల విగ్రహానికి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఘంటసాల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు జి.రామబ్రహ్మం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ ప్రతిపక్ష నేత, మరకాని సమతా కీర్తి, బ్రాహ్మణ సంఘం నాయకులు, పి.వి. ఫణి కుమార్, వేమూరి రామకష్ణారావు, ఘంటసాల సాంస్కృతిక సంఘం సభ్యులు, కర్రి విజయ శంకర్, జి. శ్రీనివాసచార్యులు, ఎస్. మల్లేశ్వర రావు, గాయకుడు ఉమర్ సాహెబ్, లైన్స్ క్లబ్ ప్రతినిధి, పి.సత్యనారాయణ, టిడిపి మచిలీపట్నం నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు, లంకి శెట్టి నీరజ, తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 100వ జయంతి కార్యక్రమాన్ని గుడివాడ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో అదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ బాపనయ్య చౌక్ వద్ద గల ఘంటసాల విగ్రహానికి కళాకారుల సమాఖ్య నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల సమాఖ్య సంఘ అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో నలుమూలల ఘంటసాల గొంతు ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటుందని, ప్రజల గుండెల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయంగా నిలిచిపోయే వ్యక్తి అని కొనియాడారు. వచ్చే సంవత్సరం ఘంటసాల శత జయంతి ఉత్సవాలను గుడివాడ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు సమైక్య నాయకులు పద్మా మైక్ బుజ్జి, పాత శ్యామ్, ప్రకాష్, బివి సత్యం,నాగేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రబీలో 3.25 లక్షల ఎకరాల్లో మినుము సాగు

అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎకరానికి 10 క్వింటాళ్ళ వరకు దిగుబడులు వస్తున్నాయి. రైతులకు ఒకింత ఆదాయం సమకూరుతుంది.

ప్ర: వైఎస్సార్ సున్న వడ్డీ పంటరుణాలు జిల్లాలో ఎందరు రైతులకు అందాయి? .

జ: 2019-20 ఖరీఫ్‌కు సంబంధించి 70238 మంది రైతులకు రూ. 12.50 కోట్లు వడ్డీ మొత్తం తిరిగి చెల్లించబడింది. 2021 సీజన్‌కు సంబంధించి 23,954 మంది రైతుల ఖాతాల్లో ఈ ఏడాది నవంబర్ 28వ తేదీన రూ. 4.09 కోట్లు జమయ్యాయి.

ప్ర: రబీ రుణ ప్రణాళిక ఎలా?

జ: పంటల పెట్టుబడికి రుణాలు ముఖ్యం. రబీ పంట రుణాల లక్ష్యం రూ. 2, 347 కోట్లు. ఇప్పటి వరకు 523 కోట్లు 23 శాతం రుణాలు మంజూరయ్యాయి. పంటల సాగుకు అనుగుణంగా రుణాలు బ్యాంకర్లు మంజూరు చేస్తారు.

ప్ర: వ్యవసాయ సలహామండళ్ళు జరుగుతున్నాయా?

జ: ఆర్బీకె, మండల, జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండలి ఏర్పాటైంది. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్బీకె స్థాయిలోనూ, రెండవ శుక్రవారం మండల స్థాయిలోనూ, మూడో శుక్రవారం జిల్లా స్థాయిలోనూ వ్యవసాయ సలహామండలి సమావేశాలు జరుగుతున్నాయి. రైతులకు కావాల్సిన వ్యవసాయ ప్రణాళిక రూపొందించి తగు సలహాలు అందజేస్తున్నాం.

Amrita Sai Institute of Science and Technology
(AUTONOMOUS)
'PROVED BY AICTE, NEW DELHI; PERMANENTLY AFFILIATED TO JNTUK, KAKINADA & S
POLYCET / EAPCET / ECET / ICET / PGECET Code: ASIP
PARITALA, KRISHNA DT – 521 180 (A. P.), TOLL FREE: 1800 1212 369 , 9948230222
www.amritasai.org.in Mail: asist@amritasai.org.in
ACCREDITED BY NAAC with 'A' grade

SPOT ADMISSION 2022-23
Category-B – Non NRI Seats (Management Quota)

Spot Admissions will be conducted for the vacant seats likely to be arise out of leftover / not reported /drop out seats in the following B.Tech programmes under Category-B (Non NRI Seats) admission for the Academic Year 2022-23. Interested eligible candidates may attend the college along with certificates to register their names on or before 06-12-22. Also may register their names for vacancies likely to arise under Convener/Management quota in B.Tech, MBA, MCA and M.Tech for the A.Y 2022-23.

Course	M Tech					MCA	MBA	MBA (Health Care & Hospital Management)	
	(ECE) DECS	(ECE) VLSI&ES	(Civil) SE	(CSE) CSE	(EEE) PE				
Cat-B Seats	4	5	7	5	5	18	36	18	
Tuition Fee (PA)	35000	35000	35000	35000	35000	27000	27000	27000	
B.Tech Courses									
Branch	CSE	CIC	CSD	CSM	CBA	ECE	EEE	MECH	CIVIL
Cat-B Seats (30%)	36	18	27	18	18	54	9	9	9
Tuition Fee (PA)	10500 0	105000	105000	10500 0	10500 0	90000	60000	60000	60000

The eligibility and admission will be as per the guidelines of Govt A.P. For further details contact: 9948230222.

Date: 04/12/2022 Sd/- Secretary & Correspondent

అగ్రిటెక్‌లో పాల్గొన్న కెవికె శాస్త్రవేత్తలు, రైతులు

ప్రజాశక్తి-ఘంటసాల

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాం - గుంటూరులో ఈనెల మూడో తేదీ నుంచి ఐదో

అగ్రిటెక్‌కు హాజరైన శాస్త్రవేత్తలు, రైతులు

తేదీ వరకూ జరుగుతున్న అగ్రిటెక్ 2022 వ్యవసాయ ప్రదర్శనను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతుల బృందం శనివారం సందర్శించింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి హాజరై సందేశం ఇచ్చారు. ఘంటసాల, కాజ, యార్లగడ్డ, మోదుమూడి, అవనిగడ్డ, బద్రిరాజుపాలెం, చాగంటిపాడు గ్రామాల నుండి రైతులను విజ్ఞాన యాత్రలో భాగంగా లాంలో జరుగుతున్న ఈ ప్రదర్శనకు వందమంది రైతులను తీసుకెళ్లామని కెవికె పోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలిపారు. మూడు రోజుల ప్రదర్శనకు 300 మంది రైతులను తీసుకెళ్లామని వివరించారు.

స్పందన పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-గన్నవరం

లండన్‌లో విద్యను అభ్యస్తున్న నిఖిల్

ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

చంద్ర పుట్టిన రోజు సందర్భంగా దావాజీగూడెంలోని స్పందన మానసిక వికాస కేంద్రానికి ఆరు ఫ్యాన్లు నిఖిల్ తల్లిదండ్రులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వెంకట్ మాట్లాడుతూ గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ చెక్కిరాల చంద్రశేఖర్ (చందు) కేసరపల్లి మండల పరిషత్ పాఠశాల టీచర్ చేస్తున్న నిర్మలకుమారి స్పందించి ఉపకరణాలు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. లండన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న నిఖిల్ చంద్ర జన్మదినోత్సవం స్పందనలో నిర్వహించడం అంటే ఎంతో దాతృత్వం ఉన్నవారు మాత్రమే ఇలాంటి సేవాకార్యక్రమాలు చేయటం సాధ్యమవుతుందన్నారు. నిఖిల్ బాగా చదువుకోని ఉన్నతమైన స్థానంలో వచ్చి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

పునీత ఫ్రాన్సిస్ శౌరి వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం

మండలంలోని అజ్జంపూడి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. విచారణ గురువులు ఫాదర్ బలుపురి యేసు రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సమిష్టి దివ్యబలి పూజలో విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు తెలవతోటి జోసెఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమిష్టి దివ్యబలి పూజలో పలువురు గురువులచే ప్రారంభించారు. గన్నవరం విచారణ గురువులు పసల తోమాస్, పెద్ద అవుటపల్లి విచారణ గురువులు ప్రవీణ్ కుమార్ ను జెరూసలెం నుండి తీసుకువచ్చిన జ్ఞాపికతో వారిని సత్కరించారు. గురువులు ఎం.ఎఫ్ ప్రొవిన్షియల్ రెవరెండ్ ఫాదర్, జోజి ఫాదర్ మైకేల్ ఫాదర్ రాయప్ప ఫాదర్ మరియన్న,ఫాదర్ సంతోష్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఒడుగు గంగాధరప్రసాద్

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

పమిడిముక్కల : ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఒడుగు గంగాధర్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సిఐటియు పమిడిముక్కల మండల రెండో మహాసభ స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో జరిగింది. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి కనీస వేతనాలు అమలు చేయడంలో వెనకబడి ఉన్నాయని విమర్శించారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్మిక చట్టాలు, హక్కులను హరించే చర్యలను విరమించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్లో ఉన్న క్లైములు వెంటనే ఇవ్వాలనీ, సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్, అంగన్వాడీ అండ్ హెల్పర్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు చిన్నారి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కోమలి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జహీరుద్దీన్ ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్‌కి ఇద్దరు ఎంపిక

గన్నవరం : రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయరాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపికలకు హాజరైన తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు షేక్. హుస్సేన్ బుడే షాహిబ్. పరసా లోకేష్ లు అసమాన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లా యూ 14 జట్టుకు ఎంపికైనట్లు రవీంద్ర భవాని తెలిపారు సోమ, మంగళవారాల్లో తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బుడే. లోకేష్‌లు కృష్ణాజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె తెలిపారు ఎంపికైన క్రీడాకారులకు పాఠశాల గణిత ఉపాధ్యాయులు కొండలరావు రూ.3000, ఆంగ్ల ఉపాధ్యాయురాలు స్వాతి రూ.3000 ప్రోత్సాహక నగదు అందజేశారు.

ధాన్యాన్ని కొనుగోలుచేయాలని కౌలు రైతుసంఘం ధర్నా

ధర్నాలో పాల్గొన్న కౌలు రైతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ఎర్ర బిపిటి(2231) కొనుగోలుపై ప్రభుత్వం నిషేధాన్ని విధించడాన్ని ఎత్తి వేసి కౌలురైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కవుతరం బ్యాంక్ సెంటర్‌లో రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 31 న ఎర్ర బి.పి.టి కొనుగోలుపై ప్రభుత్వం నిషేధం విధించడంతో గత్యంతరం లేక ప్రయివేటు వ్యాపారులకు అమ్మితే ఇప్పటివరకు కొందరికి డబ్బులు ఇవ్వలేదనిన్నారు. ప్రభుత్వం నిషేధం ఎత్తివేసి కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి నేరుగా ఆర్ బి కె కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. తోలిన ధాన్యానికి 15 రోజుల్లో డబ్బులు ఇవ్వాలని,లేకుంటే గ్రామంలో కౌలురైతులను సమీకరించి పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం కౌలురైతు సంఘం కవుతరం గ్రామ నూతన కమిటీని ఏర్పాటు జరిగింది ఈ నూతన కమిటీలో అధ్యక్షునిగా చిట్టి బొమ్మ అశోక్ ,కార్యదర్శిగా బొల్లా అంక నాగబాబు, కమిటీ సభ్యులుగా మద్దాల వెంకటేశ్వరరావు, పరిమకాయల నాగేశ్వరరావు,బోట్ల శ్రీనివాసరావు,ఈడే కొండ,చిట్టిబొమ్మ హరీష్ ఎన్నిక కాబడ్డారు .ఈ కార్యక్రమంలో ఈడే రాజా,ఈడే సాయి,ఈడే రవి,మురాల భాను ,పొలాగని పెద్దిరాజు , రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ కుమారి మృతి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం ముస్తాబాద గ్రామానికి చెందిన ఆశా వర్కర్ నిమ్మగడ్డ కుమారి ఆదివారం మృతి చెందారు. సిఐటియు కృష్ణాజిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవిబాబు, సిఐటియు గన్నవరం మండల కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు, ముస్తాబాద గ్రామ సిపిఎం కార్యదర్శి కైలే ఏసుదాసు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దాసి బాబూరావు, కల్లం రాంబాబు, సిపిఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, ప్రజానాట్యమండలి గన్నవరం ఏరియా కార్యదర్శి నాగరాజు, ప్రజానాట్యమండలి కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.కొండలుబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు నాగలక్ష్మి తదితరులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆశా వర్కర్ల ఉద్యమంలో ఆమె పాల్గొందని చౌటపల్లి రవి చెప్పారు. ఆమె మృతి ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.

భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఉత్తమ యువజన సంఘం అవార్డుకు దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

భారత ప్రభుత్వం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి కృష్ణా జిల్లా వారి ఆధ్వర్యంలో 2021- 22 సంవత్సరానికి జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన యూత్ క్లబ్స్,మహిళా సంఘాల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కిరణ్మయి దేవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ యువజన సంఘం అవార్డు కోసం దరఖాస్తు చేసే రిజిస్టర్డ్ కాబడిన యూత్ క్లబ్స్, మహిళా సంఘాలు, నెహ్రూ యువ కేంద్రానికి అనుసంధానంగా పని చేస్తూ ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు సంఘం ఆడిట్ వార్షిక నివేదికలతో పాటు 1 ఏప్రిల్ 2021 నుండి 31 మార్చి 2022 వరకు సంఘం ద్వారా నిర్వహించిన యువజన అభివృద్ధి కార్యక్రమాలు నివేదికలు ఫొటోలు, పత్రికా ప్రచురణలు జత చేసి ఈనెల 10వ తేదీ లోపు నెహ్రూ యువ కేంద్ర, ప్లాట్ నెంబర్ 24, లక్ష్మి నిలయం 2 వ ఫ్లోర్ లక్ష్మీపతి నగర్ ఆటోనగర్ గేట్ బస్టాప్ దగ్గర విజయవాడ 520007 చిరునామాలో పోస్ట్ ద్వారా గాని వ్యక్తిగతంగా గాని పంపాలన్నారు. ఉత్తమ సంఘంగా ఎంపికైన యువజన సంఘానికి రూ.25 వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. గత 2 సంవత్సరాల లోపల అవార్డు అందుకున్న సంఘాల వారు ఇప్పుడు తిరిగి దరఖాస్తు చేయడానికి అనర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు, ఇతర వివరాల కోసం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయం లేదా, ఫోన్ : 0866-2555828, 6303677849, సెల్ : 9490908517 లేదా dyc.vijayawada@gmail.com లో సంప్రదించాలని కోరారు.

సిఎం జగన్ స్పందించకుంటే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి-గన్నవరం

తమ సమస్యల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి తగిన నిర్ణయం తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని విమానాశ్రయ నిర్వాశితుల పోరాట కమిటీ నాయకులు తిరువీధి ఏసురత్నం హెచ్చరించారు. గన్నవరం మండలం దావాజీ గూడెంలో తమ సమస్యలు పరిష్కరించాలని నిర్వాశితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 25వ రోజుకు చేరాయి.

దీక్షల్లో పాల్గొన్న రైతులు

నిర్వాశితులు మొక్కవోని దీక్షతో ఉద్యమం నిర్వహిస్తున్నారు. వంటావార్పు చేసి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ పోరాటం చేయకుండా ప్రభుత్వం దిగొచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి సరిపెడుతున్నారన్నారు. సిఎం జగన్ తక్షణమే స్పందించాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో మౌలిక వసతులు కల్పించాలని, అందరికీ ఇల్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న అద్దె బకాయిలు తక్షణమే లబ్ధిదారుల ఖాతాలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు తంబి, తిరువీధి సుబ్బారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి 7000 మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి మొక్కుబళ్లను తీర్చుకున్నట్లు తెలిపారు.

'మత్తు'కు బానిసవ్వొద్దు : ఐద్వా

ప్రజాశక్తి-వన్‌టౌన్: నేడు సమాజంలో యువతీ యువకులు మద్యం, మత్తు పదార్ధాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటి నుండి దూరంగా

ఉండాలని ఐద్వా పశ్చిమ సిటీ కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి తెలిపారు. హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 51వ డివిజన్ కొండ ప్రాంతంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంచెలంచెలుగా మద్యం నియంత్రిస్తానని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మద్యం ఏరులై పారుతోందన్నారు. ప్రభుత్వాలు మద్యం, మత్తు పదార్ధాల నియంత్రణకు పటిష్టమైన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్ధాలకు బానిసలైన యువకులు ఆ మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తూ, అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మగ, ఆడ అనే తేడా చూపించకుండా పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటరత్నం, వి.స్వప్న ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

బ్రిటానియా ఉత్పత్తులు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: బ్రిటానియా ఉత్పత్తులను నగర మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ బిజినెస్ హెడ్ అభిషేక్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో బ్రిటానికా సంస్థ ముందుంటుందని తెలిపారు. వినియోగదారులకు పోషకమైన, రుచికరమైన, వాటిని అందించాలనే ఉద్దేశంతోనే వీటిని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇన్నోవేటివ్ ఉత్పత్తులను తీసుకురావడంలో తమ సంస్థ అగ్రభాగాన ఉంటుందని తెలిపారు.

41వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-భవానీపురం: 41 డివిజన్‌లో టిడిపి డివిజన్ అధ్యక్షులు షేక్ సుభాని ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జీ సయ్యద్ కరీముల్లా పర్యవేక్షణలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ మైనారిటీ నాయకులు ఎమ్.యస్. బేగ్, రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి

శ్రీనివాస్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి సారిపల్లి రాధాకష్ణ ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర పరిస్థితి అన్ని రంగాల్లో అధోగతి పాలవుతున్న నేపధ్యంలో 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం బూత్ నెంబర్ 23, 24, 47, 48 యూనిట్ ఇంచార్జీలు శానం వాణి, సమద్ బాషాతో కలిసి ఇంటింటికీ వెళ్లిసమస్యలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కరకట్ట ప్రాంత నివాసితులకు తమ పార్టీ అధికారంలో రాగానే ఇంటి పట్టాలు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నెరవేర్చలేదని, అధిక ధరలతో సామాన్య కుటుంబాలు జీవనం భారమైందని స్థానికులు తమ వద్ద వాపోయినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటిడిపి అధ్యక్షులు అద్దేపల్లి శివ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు సుకాశి సరిత, ప్రధాన కార్యదర్శి షేక్ నసీమా, జి.సందీప్, స్వరూప్, వాణి, షకీలా, షబ్బీర్, సుభాని, డివిజన్ పార్టీ అధ్యక్షులు పోనుగుపాటి చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

నేటి నుంచి దోకిపర్రు మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

- 7న ధ్వజారోహణం, గజ వాహనోత్సవం, 8న విశేష శ్రీనివాస కళ్యాణం
- పాల్గొనున్న మహాక్షేత్రం వ్యవస్థాపక ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:
గుడ్లవల్లేరు మండలం దోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సప్తమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి గురువారం వరకూ జరగనున్నాయి. శ్రీ వైఖానస భగవత్చా శాస్త్ర మార్గానుసారంగాశుభకృత్ నామసంవత్సర మార్గశిర శుద్ధ ద్వాదశి సోమవారం నుంచి పూర్ణిమ గురువారం వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని వేదపండితులు నిర్ణయించారు. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈబ్రహ్మొత్సవాల్లో పాల్గొని, శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవాల్సిందిగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు కోరారు. ఈనాలుగు రోజులపాటు ఆలయాన్ని సందర్శించిఏడుకొండల వేంకటేశ్వరుని దర్శించుకునే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు పీ వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు తెలిపారు. దోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ 2013లో జరిగిందన్నారు. 2015 మే 30 న మహాక్షేత్రం లో శ్రీవెంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించామని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఏటేటా బ్రహ్మోత్సవాలు,ప్రతిష్టాసహిత అవతారోత్సవాలు జరుగుతున్నాయన్నాయని వివరించారు. వరలక్ష్మీవ్రతం, కార్తీక దీపోత్సవం, ఏటేటా జనవరి మాసంలో గోదా కళ్యాణం, పండుగలు, ఇతర ముఖ్యమైన రోజుల్లో ప్రత్యేక పూజలు మహాక్షేత్రంలో ఆలయ ధర్మకర్తలు నిర్వహిస్తున్నారని వివరించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మహాక్షేత్రంలో పాటు పరిసర ప్రాంతాలను రంగు రంగుల విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. ఈ నాలుగు రోజులపాటు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై వివిధ నాట్య బృందాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నాయని తెలిపారు. మహాక్షేత్ర ప్రాధాన్యత, శ్రీ వేంకటేశ్వరుని మహిమలను ఆధ్యాత్మికవేత్తలు వివరించనున్నారని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే పూజలకు ప్రత్యేకంగా వేదికలు, వాహనాలను ధర్మకర్తలు సిద్ధం చేశారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5.30 నుంచి 9 గంటల వరకు మహాక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని ధర్మకర్తలు కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

దోకిపర్రు మహాక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అంకురారోపణం, తిరుచ్చి(పల్లకీ)సేవలు జరుగుతాయి. రెండో రోజున మంగళవారం నాడు ధ్వజారోహణ ఉత్సవం నిర్వహిస్తారు. అదేరోజున శ్రీవారికి సూర్యప్రభ వాహనం, శేషవాహనం, హంస వాహనసేవలు జరుగుతాయి. బుధవారం నాడు గజవాహనోత్సవం, రథోత్సవం, గరుడోత్సవం, చివరి రోజైన డిసెంబర్ ఎనిమిదో తేదీన చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, విశేష శ్రీ శ్రీనివాస కళ్యాణోత్సవం, ధ్వజ అవరోహణ, చంద్రప్రభ వాహనోత్సవం జరుగుతాయని మహాక్షేత్రం వ్యవస్థాపక ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది నూతన పుష్కరిణిని ధర్మకర్తలు ప్రారంభించనున్నారు.ఈ నెల 10న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దోకిపర్రు మహాక్షేత్రంలో సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు.

మధుర మేజర్‌కు సామర్థ్యానికి మించి నీరు

ఆందోళనలో పత్తి, మిరప రైతులు

ప్రజాశక్తి-గంపలగూడెం: మధుర మేజర్ కెనాల్‌కు సామర్థ్యాన్ని మించి నీరు విడుదల చేయడంతో పత్తి, మిరప పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే సాగర్ జలాలు నిలిపి వేయాల్సి ఉండగా తెలంగాణ ప్రాంతానికి నీరు అవసరం కావడంతో శుక్రవారం రాత్రి మధుర మేజర్ బ్రాంచ్ కెనాల్‌కు నీటి ఎద్దడి పెరిగి స్థానికంగా పంటలు నీట మునుగుతున్నాయి. అవసరమైనప్పుడు నీటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించే అధికారులు అవసరం లేనప్పుడు అధిక స్థాయిలో విడుదల చేయటం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీర్ఘ కాలికంగా కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో మరింత అస్తవ్యస్తంగా నీరు పొంగిందని తెలిపారు. తెలంగాణ అధికారులను ఈ విషయమై ప్రస్తావించక తమకు సంబంధం లేదంటూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని రైతులు తెలుపుతున్నారు. స్థానిక అధికారులను అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని రైతులు వాపోయారు.

ఊటుకూరుకు వైసిపి నాయకులు, ప్రముఖ రైతు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఈ విషయంపై మాట్లాడుతూ అడ్డగోలుగా వదిలిన నీటి ఉధృతితో దాదాపు 200 ఎకరాల్లో పతి, మిరప దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ నష్టాన్ని ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. విధులపై అవగాహన లేకే ఈ దుస్థితి దాపురించిందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టేట్ డెఫ్ క్రికెట్ టీమ్‌లో అమెజాన్ ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

శారీరక వైకల్యం ఉన్నా తమిళనాడు డెఫ్ క్రికెట్ టీమ్‌లో అమెజాన్ ఉద్యోగులు చక్కగా రాణిస్తున్నారని సంస్థ రీజనల్ ప్రతినిధి కె.ఎస్.ఆర్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. వైకల్యం ఉన్నా ఆటల్లో చక్కగా రాణిస్తున్నారని తెలిపారు. అమెజాన్‌లోని ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రంలో వినియోగదారుల ఆర్డర్‌లను ప్యాక్ చేస్తున్నారన్నారు. అయితే ఇటీవల కాలంలో వైకల్యం ఉన్న వారిని క్రీడల్లో ఆదరిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే కుమార్ ఎస్., మహారాజా బి. అనే ఇద్దరు వ్యక్తులు వినికిడి లోపంతో ఉన్నారన్నారు. అయినా డెఫ్ క్రికెట్ టీమ్‌లో ఉంటూ స్టేట్ మీట్‌కు హాజరవుతూ ప్రతిభ కనపరుస్తున్నారని తెలిపారు.

'కవులు, రచయితలే సమాజాన్ని కాపాడాలి'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: సమాజంలో పేరుకుపోయిన భావదారిద్ర్యాన్ని కడిగేసే విధంగా కవులు, రచయితలు తమ రచనలు సాగించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ అధ్యక్షులు వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక గాంధీనగర్లోని ఎన్జీవో హోమ్ ఆడిటోరియంలో కడపకు చెందిన కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పురస్కారాలు-2022 ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ శ్రీమతి వాసిరెడ్డి పద్మ ముఖ్యఅతిథిగా హాజరై ఐదుగురు రచయిత్రులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ- ప్రభుత్వం రచయితల్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థలు కూడా ఆ బాధ్యతను తీసుకుని రచయితల్ని ప్రోత్సహిస్తూ పురస్కారాలివ్వడం సంతోషించాల్సిన -విషయమన్నారు. పురస్కారాలు రచయితలు మరిన్ని మంచి రచనలు చేయడానికి ఉపయోగపడతాయన్నారు సభకు అధ్యక్షత వహించిన సుప్రసిద్ధ కవయిత్రి డా?యంబిడి శ్యామల మాట్లాడుతూ....కవిత విద్యా సాంస్కృతిక సేవాసంస్థ పురస్కారాల ఎంపికలో పారదర్శకత పాటిస్తుందన్నారు. ఈ సభలో ఎన్టీఆర్ జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ ఏ విద్యాసాగర్, డా?పట్టాభి కళాపీఠం అధ్యక్షులు డా? తూములూరి రాజేంద్రప్రసాద్, జాతీయ మహిళా సమాఖ్య బాధ్యులు శ్రీమతి అక్కినేని వనజ, కథా నవలా రచయిత అలపర్తి రామకష్ణ, కేంద్రసాహిత్య అకాడమీ యువ యువ పురస్కార గ్రహీత, రచయిత వేంపల్లె షరీఫ్, ప్రసిద్ధ కవి బంగార్రాజు కంఠ, మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, కవయిత్రి గంగవరపు సునీత, కవిత సంస్థ అధ్యక్ష కార్యదర్శులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, శ్రీమతి బోయపాటి

దుర్గాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి శ్రీమతి వాసిరెడ్డి పద్మ చేతుల మీదుగా కందుకూరి నవలా పురస్కారాన్ని ఎమ్.ఆర్.అరుణకుమారి, గురజాడ కథా పురస్కారాన్ని బండారు విజయ, శ్రీశ్రీ కవితా పురస్కారాన్ని పద్మావతి రాంభక్త, జానమద్ది సాహిత్య పురస్కారాన్ని ఆచార్య కిన్నెర శ్రీదేవి, డాక్టర్ రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారాన్ని సమ్మెట ఉమాదేవిలకు నిర్వాహకులు అందజేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.